# తెలుగు నవలా! 'కల'కాలం బ్రతుకు!

జానకి తను చదివిన సీరియల్ నవలలోని కథ చెప్తోంది!

ఇందిర వెర్రిదానిలా కళ్లు విప్పార్చుకుని చూస్తూ కథ వింటోంది!సినీమాలో బొమ్మలు కదలిపోయినట్లు ఇందిర కళ్ళముందు కథ వేగంగా నడుస్తోంది. ఆ క్షణంలో, పదహారేళ్ళ ఇందిరకు తనకంటె సుమారు పదేళ్లు పెద్దదయిన జానకిమీద అమితమయిన గౌరవం ఏర్పడిపోయింది. 'జానకి సీరియల్ నవలలు భలే చెప్తుంది. అవి వింటూవుంటే అసలు కాలం కదులుతున్నట్లు తెలీదు' అనుకుంది మనసులో.

"అమ్మాయ్" అన్న తండ్రి పిలుపువిని "నాన్నాగారు వచ్చేరు. ఆయనకి భోజనం వడ్డించి మళ్ళీ వస్తాను. ఈలోగా నువ్వుకూడా భోజనం చేసెయ్" అంటూ అక్కడి నుండి లేచింది ఇందిర.

"నా భోజనం ఎంతసేపు? రెండు నిమిషాల్లో అయిపోతుంది. నువ్వు తొందరగా వచ్చెయ్, లేకపోతే నాకు తోచదు. అన్నట్టు మీ బావగారు ఈవేళ రాత్రికి వస్తారు. అసలు ఈపాటికే రావాల్సింది. లారీ 'ట్రబులు' ఇచ్చిందేమో. ఆయన తెచ్చే మల్లెపువ్వుల్లో నీకూ వాటా ఇస్తానులే" అంటూ ఇందిర బుగ్గలమీద చిటికవేసి చెప్పింది జానకి.

ఇందిర లేచి పరికిణీ, కండువా సర్దుకుని తమ వాటాలోకి వచ్చేసింది.

"కాళ్లు కడుక్కో నాన్నా, అన్నం వడ్డిస్తాను" అంటూ వంటింట్లోకి పరుగెత్తింది. కంచంలో అన్నం వడ్డించి, పీటవాల్చింది. సుమారు రెండేళ్ళక్రితం తల్లి పోయినప్పటి నుండీ ఇంట్లో వంటా వార్పూ ఇందిరే చూసుకుంటోంది. తండ్రి ఎలిమెంటరీ స్కూల్లో టీచరు. ఆయన స్కూలుకు వెళ్ళిపోతే ఇందిర ఒక్కతే బిక్కుబిక్కుమంటూ వుండాలి. ఇంట్లో, రెండో వాటాలో జానకీ, వాళ్ళాయినా పదిహేను దినాల క్రితమే దిగేరు. జానకి భర్త లారీ డ్రయివరు. జీతం రెండొందలయాభై కాక పైన మరో రెండు వందలు సంపాదిస్తాడని జానకే చెప్పింది. ఈ పదిహేను రోజుల్లోనూ రెండుసార్లే అతణ్ణి చూసింది ఇందిర. ఏ రాత్రి సమయంలోనో వచ్చి మళ్ళీ తెల్లవారు జామునే వెళ్ళిపోతూ ఉంటాడు. అది కూడా నాలుగయిదు దినాలకు ఒకసారి! వాళ్లు ఆ వాటాలో దిగిన నాలుగు రోజుల్లోనే జానకితో బాగా చనువు ఏర్పడిపోయింది ఇందిరకు. ఈ పదిహేను రోజుల్లోనూ ఒకరినొకరు 'నువ్వు' అని పిల్చుకునే స్థితికి వచ్చేశారు. తండ్రి భోజనం ముగించేక స్కూలుకు పంపి తను కూడా భోజనం చేసి, వంటిల్లు సర్ది తలుపు గడియపెట్టి, పక్క వాటాలోకి వచ్చింది ఇందిర.

జానకి తీరికగా మంచంమీద కూర్చుని కాలుమీద కాలువేసుకుని తమలపాకులకు సున్నం రాసి నముల్తోంది. ఇందిరను చూసి "పిల్లా తమలపాకులు వేసుకుంటావా? "అని అడిగింది. ఇందిర వద్దన్నట్లు మొహమాటంగా తల వూపింది.

"ప్రతిదానికి ఇంత మొహమాటమయితే ఎలా? రేపు మొగుడితో కాపురం ఎలా చేస్తావ్? "అంటూ బలవంతంగా చెక్కా ఆకులూ ఇందిరనోట్లో కుక్కింది. కొంతసేపు పోయాక "ఎర్రగా రక్తం పూసుకున్నట్లుంది: అబ్బో! ఇంకేం నీకు మొగుడిమీద బోలెడంత ప్రేమ అన్నమాట!" నవ్వుతూ అంది.

ఇందిర సిగ్గుపడి పోతూ "నేను వెళ్ళిపోతాను ఇలా అయితే" అంటూ లేవబోయింది. జానకి ఆమె రెండు భుజాలు పట్టుకుని తనప్రక్కనే బలవంతంగా కూర్చో బెట్టుకుంది. "అలా మాట్లాడతావుకాని నీకు మాత్రం మొగుడంటే సరదాలేదేమిటి?" అంది "ఛీ అలాంటి కబుర్లొద్దన్నానా" అంటూ విసుక్కుంది ఇందిర. పైకి విసుగు నటించినా, జానకి అలా మాట్లాడుతూ వుంటే ఏదోలా వుంది ఆమెకు. జానకి మాటల్లో అదే ప్రత్యేకత అనుకుంది. "ఇందాక సగంలో ఆపేసిన సీరియల్ 'అమరప్రేమ' చెప్పేయ్ చాలా బాగుంది" అంది.

"సీరియల్ నవలల కేంభాగ్యం! నాకు ముప్పయివరకూ వచ్చును. ఇప్పటికి నీకు ఎన్ని చెప్పేను?"

"ఆరు. ఇది ఏడోది" అంది ఇందిర, ఆ నవలల్ని జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూ

"అంటే, ఇంకా నీకు ఇరవై మూడుసీరియల్ నవలలు చెప్పాలన్నమాట సరేగాని, పిల్లా! నువ్వు నాకు ఈ సాయంత్రం తలంటుపొయ్యాలి" అంది.

"రేపు ఉదయం పోసుకో" అంది ఇందిర.

"రేపు పోసుకుంటే మజాలేదు. ఈ సాయంకాలం తలంటు పోసుకొని, జుత్తు ఆరబెట్టుకుని, వదులుగా జడ వేసుకుని, ఆ జడలో ఒక గులాబీ తురుముకొని, తెల్లచీరతో ఆయన వచ్చేవేళకు ఎదురయ్యానంటే, ఆయన ముగ్ధులయి పోతారు. ఆయన తెచ్చిన మల్లెచెండు నా తలలో పెట్టి, నన్ను దగ్గరగా తీసుకుంటారు. అప్పుడు నేను 'ఫోండి బాబూ' అంటూ ఆయన్ని విదిలించుకుంటాను.ఆయన నన్ను వదలకుండా ఇలా మంచం మీదకు తోస్తారు." అంటూ ఇందిర భుజాలమీద రెండు చేతులూ వేసి మంచం మీదకు తోసేసింది. ఇందిర లేవబోయింది. జానకి లేవనివ్వలేదు. "అప్పుడేం చేస్తారో తెలుసా? ఇలా నా ముఖంలోకి రెండునిమిషాలు తియ్యగాచూసి..." అంటూ ఇందిర బుగ్గల్ని గట్టిగా గిల్లేసింది.

"ఛీ" అంటూ విదిలించుకుని లేచి పోయింది ఇందిర.

జానకి కిలకిలా నవ్వేసింది. "ఏం అనుకోకు పిల్లా " అంటూ.

"ఇంతకీ సీరియల్ నవల చెప్తావా? లేకపోతే వెళ్ళిపోనా?" అంది ఇందిర కోపం అభినయిస్తూ, నిజానికి ఈ కబుర్లు అమెకు బాగానే వున్నాయి!

"అంత కోపం అయితే ఎలా? చెప్తాను. ఆ! ఎంతవరకూ వచ్చింది? హరిచరణ్

బంగ్లా వరండాలో కూర్చుని సైపు కాలుస్తూ, హేమంతి కోసం ఎదురు చూస్తున్నాడని చెప్పేను కదూ? అంతలో ఒక పొడుగాటి కారు హంసలా వచ్చి ఆ బంగళా ముందు ఆగింది. అందులోంచి ఒక అప్సరస లాంటి అమ్మాయి దిగింది. వయ్యారంగా నడుచుకుంటూ తోట దాటి బంగళా వద్దకు వచ్చి మెట్లెక్కింది. హేమంతిని చేతులూ రెండూ చాచి ఆహ్వానించేడు హరిచరణ్, అంతకన్నా గాఢంగా తన చేతులు రెండూ చాపి అతని గుండెలమీద వాలిపోయింది హేమంతి...

"అదేమిటి? వాళ్ళిద్దరికీ అంతకుముందు పరిచయం లేదుకదా? మరి ఆ వాలిపోవడాలేమిటి?" అంది ఇందిర.

"గుండెలమీద వాలిపోవటానికి ఇంతకు ముందు పరిచయం వుండాలేమిటి? 'అమరప్రేమ' అంటే అలాగే ఉంటుంది. అప్పుడు 'హేమా' అన్నాడతను మత్తుగా. 'చరణ్' అంది ఆమె ఇంకా మత్తుగా. అతడు పెదాలతో ఆమె పెదాలు స్పృజించాడు..."

"మరి సైపు కాలుస్తున్నాడన్నావు కదా. అదేమయింది?" అంది ఇందిర.

"పానకంలో పుడకలా, అలాటి ప్రశ్నలు వెయ్యొద్దు అది తీసి టేబుల్ మీద పడేశాడు. ఛీ మూడ్ అంతా పాడుచేశావు...." అంటూ విసుక్కుని మళ్ళీ ప్రారంభించింది జానకి.

జానకి తను చదివిన సీరియల్ నవలలోని కథ చెప్తోంది. ఇందిర వెర్రిదానిలా కళ్ళు విప్పార్చుకుని చూస్తూ వింటోంది.

★ ★ ★

ఆ రాత్రి పదిగంటల సమయంలో వెన్నెల ఎవరో బీరపువ్వుల్ని తుంపి ఆరుబయట పారబోసినట్లుంది. చల్లగాలి మనసైన ప్రియుడు మెల్లగా బుగ్గలమీద స్పృజిస్తున్నట్లు సుఖంగా హాయిగా వీస్తోంది.

అలాటి సమయంలో

వీధివరండాలో చాపమీద పడుకున్న ఇందిరకు నిద్రపట్టలేదు. మనసునిండా ఏవో తియ్యటి తలపులు ముసురుతున్నాయి. ఒడలంతా పులకింత కలుగుతోంది. 'జానకిభర్త వచ్చి గంటసేపయింది. ఈ సరికి ఇద్దరూ భోజనం ముగించి వుంటారు' అనుకొంది. మూసివున్న వాళ్ళ గదితలుపు సందులో నుండి లోని దీపకాంతి సన్నని చారగా వరండా మీద పడుతోంది.

'ఈపాటికి ఇద్దరూ తమలపాకులు నములుతూ మంచంమీద కూర్చుని వుంటారు.' అనుకొంది కొంతసేపు పోయాక.

'తలుపు సందులోనుండి చూస్తేనో?' అనిపించింది. ఈ ఆలోచన రాగానే గుండె దడదడలాడింది.

'అమ్మో! ఎవరయినా గమనిస్తే ఇంకేమయినా వుందా?'

అంతలో పెద్దపెట్టున ఒక గాలితెర వచ్చింది.

'అబ్బ!అప్పుడే చలితిరిగింది'. అనుకుంటూ కాళ్ళదగ్గరవున్న దుప్పటి గుండెలమీదకు లాక్కుంది. లోపల గదిలోంచి తండ్రి గురక మెల్లగా విన్పిస్తోంది. నిద్రపట్టక ఇటూ అటూ దొర్లింది ఇందిర. జానకి మధ్యాహ్నం చెప్పిన కబుర్లు మెదడులో సుడులు తిరిగి మనసును మత్తుతో నింపుతున్నాయి.

ఈ పాటికి జానకి మొగుడు ఆమెను దగ్గరగా తీసుకుని ఆమె కళ్ళల్లోకి తియ్యగా చూస్తూ వుంటాడు. తరువాత ఇంకా దగ్గరగా జరిగి.... అంతలోనే 'ధబ్' మని తలుపు తెరచుకుంది!

ఒక్క ఉదుటున జానకి వచ్చి వరండా మీద పడింది!

"చలిలో చావు ముండా" అంటూ జానకి మొగుడు పెద్దశబ్దం చేస్తూ తలుపు లోపల గడియ పెట్టేసుకున్నాడు.

ఇందిర త్రుళ్ళిపడి లేచికూర్చుంది. జానకి మెల్లగా లేచి కన్నీళ్లు తుడుచుకుంటూ ఇందిర దగ్గరకు వచ్చి ఆమె పక్కనే కూర్చుంది.

ఇందిరకు రెండు క్షణాలు ఏంమాట్లాడాలో తోచలేదు.

జానకి కన్నీళ్ళు ఒత్తుకుంటూ "బాగా తాగివచ్చేరు. తాగితే ఎప్పుడూ ఇంతే" అని కొంతసేపు ఆగి "ఈవేళ నీ చాపమీద పడుకుంటాను. నాకూ కొంచెం చోటివ్వు" అంటూ మూలుగుతూ, ఇందిర ప్రక్కన నడుంవాల్చింది జానకి.

ఇందిర పడుకుందేకాని ఆమెకు నిద్రరాలేదు!

మేఘాల వెనుక బరువుగా కదలిపోతున్న చందమామ వంక చూస్తూ అనుకొంది.

'ఈమొగాళ్ళు ఎందుకు తాగుతారు? తాగివచ్చి భార్యల్ని ఎందుకు కొడతారు? సీరియల్ నవలల్లోని బ్రతుకుల్లా నిజజీవితాలు ఎందుకుండవు?' ఈ ప్రశ్నలకు ఎంత ఆలోచించినా ఆమెకు సమాధానాలు తట్టలేదు.

చాలా సేపటి తర్వాత మగత నిద్రలోకి జారి పోయాక ఆమెకు ఒక కలవచ్చింది.

ఆ కలలో -

జానకి సీరియల్ నవలలోని కథ చెప్తోంది!

తాను వెర్రిదానిలా కళ్లు విప్పార్చుకుని చూస్తూ వింటోంది!! ★

(స్నేహ మంత్లీ జూన్ 1978)